14న భగీరథ మహర్షి జయంతి వేడుకలు

నగర సంఘం అధ్యక్షుడు ఉప్పరిశేఖర్


మాట్లాడుతున్న ఉప్పరి శేఖర్

గచ్చిబౌలి: భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని రాష్ట్ర నగర సంఘం అధ్యక్షుడు ఉప్పరిశేఖర్ తెలిపారు. గచ్చిబౌలి అంజయ్యనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కఠోర దీక్షతో ఒంటి కాలిపై తపస్సు చేసి పరమ శివుడిని ఒప్పించి పవిత్ర గంగను దివి నుంచి భువికి తీసుకొచ్చిన మహనుభావుడు భగీరథుడు అని అలాంటి మహనీయుని జయంతి వేడుకలను నిర్వహించడం సమాజానికి అవసరమన్నారు. నగరజాతి కులగురువైన ఆయన వేడుకలను తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామ, మండల, జిల్లా కేంద్రాలలో కూడా సగరులు ఎక్కడికక్కడ ఘనంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు భగీరథుని జయంతి వేడుకలు జరుపుతున్నప్పటికీ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి ఎన్నికల కోడ్ రావడంతో ఈ ఏడాది నిర్వహించడం లేదని స్పష్టం చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే వేడుకల్లో బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఇతర ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం రవి, ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకట్‌రాములు, యువజన అధ్యక్షుడు సీతారాం పాల్గొన్నారు.

శివసాయి క్షేత్రంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు


పూజల్లో పాల్గొన్న ఆలయ నిర్వాహకులు, భక్తులు

రాయదుర్గం: వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య చండీహోమం, రుద్రహోమం, గణపతి హోమం పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో మూడవ రోజైన శనివారం ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రత్యేకంగా రామసాయిస్థూపం ప్రతిష్ట కార్యక్రమాన్ని భక్తులు, ఆలయ నిర్వాహకుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. ఆలయంలో కాశీ విశ్వేశ్వరస్వామి, షిర్డీ సాయిబాబా, అన్నపూర్ణాదేవి, గణపతి, ఆంజనేయస్వామి, ధన్వంతరి స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డిపార్వతి, భక్తులు, ఆలయ నిర్వాహకులు, అర్చకులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి




రోడ్డుపై పారుతున్న మురుగునీరు

మియాపూర్: మియాపూర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రోడ్డులో మురుగునీరు పొంగి రోడ్డుపై ప్రవహిస్తోంది. ప్రధాన రోడ్డులో మురుగునీరు ప్రవహించడంతో దుర్వాసన వస్తుండటంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్‌లో ఉన్న చెత్త చెదారం ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో మ్యాన్‌హోళ్ల నుంచి మురుగునీరు పొంగి రోడ్లపై ప్రవహిస్తుంది. ఫిర్యాదు చేసిన ప్రతిసారి సిబ్బంది వచ్చి తూతూ మంత్రంగా పనులు చేసి వెళ్లిపోతున్నారని దీంతో సమస్య పునరావృతం అవుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి

ఎస్పీ రూపేష్


సూచనలు చేస్తున్న ఎస్పీ రూపేష్

పటాన్‌చెరు టౌన్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికారులు విధులు నిర్వర్తించాలని ఎస్పీ రూపేష్ ఆదేశించారు. ఆదివారం పటాన్‌చెరు మండలం రుద్రారం ఎన్నికల సామగ్రి పంపిణీ సెంటర్ వద్ద రూట్ మొబైల్ అధికారులు, సిబ్బంది, ఇతర అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, ఎన్నికల సామగ్రి రక్షణ బాధ్యత రూట్ మొబైల్ అధికారులదే అన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎన్నికల కోడ్‌ను తప్పకుండా పాటించాలన్నారు. సమావేశంలో పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ ప్రవీణ్ రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: కడుపు నొప్పి భరించలేక యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఆదివారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పటాన్‌చెరు మండలం ముత్తంగి న్యూటన్ కాలనీకి చెందిన ప్రమీల(17) రెండు సంవత్సరాలుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. వైద్యం చేయించినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో 11వ తేదీన సోదరులు ప్రేమ్, ప్రవీణ్ పనికి వెళ్లిన తర్వాత ఇంటిలో ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన సోదరులకి ప్రమీల ఆత్మహత్య చేసుకుని కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు ప్రేమ్ తన సోదరి కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పర్యాటకుల సందడి

గోల్కొండ: గోల్కొండ కోట పర్యాటకులతో కిటకిటలాడింది. నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున పర్యాటకులు కోటకు తరలివచ్చారు. పాఠశాలలకు సెలవులు కావడంతో తమ తమ పిల్లలతో పలు కుటుంబాలు కోటకు తరలి వచ్చాయి. కోటలోని నగీనాబాగ్, క్లాపింగ్ పోర్టికో తదితర ప్రాంతాల వద్ద పిల్లలు సందడి చేస్తూ ఆటలు ఆడుకున్నారు. పలువురు యువ జంటలు క్లాపింగ్ పోర్టికో వద్ద గల భారీ ఫిరంగి వద్ద సెల్ఫీలు దిగారు. రామభక్తులు కోట ఎగువ భాగంలో గల భక్త రామదాసు బందీఖానాను సందర్శించి భక్త రామదాసు చరసాలను సందర్శించారు.




గచ్చిబౌలి స్టేడియం నుంచి పోలింగ్ సామగ్రితో తరలివెళ్తున్న సిబ్బంది


స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి ఈవీఎంలను తీసుకెళ్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

నేడే పోలింగ్.. పోటెత్తాలి ఓటింగ్!

- ఏఆర్‌ఓ స్నేహ శబరిష్ పర్యవేక్షణలో ఈవీఎంల పంపిణీ
- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సైబరాబాద్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్




చంటి బిడ్డతో ఎన్నికల విధులకు వచ్చిన ఉద్యోగిని

గచ్చిబౌలి: చేవెళ్ల లోక్‌సభ పరిధిలో శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రాష్ట్రంలోనే అతి పెద్ద నియోజకవర్గంలో మరికొన్ని గంటల్లో జరగనున్న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన డీఆర్‌సీ సెంటర్‌లో శేరిలింగంపల్లి ఏఆర్‌ఓ స్నేహ శబరిష్ ఆధ్వర్యంలో ఎన్నికల పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లతో పాటు ఇతర సామగ్రిని అందజేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని 57 సెక్టార్లుగా విభజించి ఆయా రూట్‌లలో బస్సులపై పోలింగ్ స్టేషన్లకు సిబ్బంది చేరుకున్నారు. పోలింగ్ సామగ్రితో పోలింగ్ స్టేషన్లకు వెళ్లేందుకు పోలీసు బందో బస్తు సిద్ధం చేశారు.భద్రతా ఏర్పాట్లను సైబరాబాద్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ పర్యవేక్షించారు.

మూడు వేల మంది సిబ్బంది..

ఎన్నికల పోలింగ్ విధుల్లో దాదాపు మూడు వేల మంది సిబ్బంది పని చేస్తున్నారు. నియోజకవర్గంలో 633 పోలింగ్ స్టేషన్లు ఉండగా ఒక్కో స్టేషన్‌లో నలుగురు సిబ్బంది చొప్పున 2532 మంది పని చేస్తారు. 57 సెక్టార్లకు సెక్టార్ ఇన్‌చార్జిలు, సూపర్‌వైజర్లు ఉంటారు. 19 మంది మైక్రో అబ్జర్వర్లు, ఏఎల్‌ఎంటీలు ఉంటారు. అత్యవసర పరిస్థితుల్లో విధులు నిర్వహించేందుకు 251 మంది సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచారు.

ఏర్పాట్లు పూర్తి

పోలింగ్ ఏర్పాట్లను పూర్తి చేశామని శేరిలింగంపల్లి ఏఆర్‌ఓ, వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరిష్ తెలిపారు. పోలింగ్ స్టేషన్లకు సిబ్బందిని తరలించేందుకు 140 బస్సులను అందుబాటులో ఉంచామన్నారు. సోమవారం ఉదయం 4 గంటలకు సెక్టార్ ఆఫీసర్లు పీఎస్‌లకు చేరుకుంటారని, ఉదయం 5.30 గంటలకు ఆయా పార్టీల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించారు. సాయంత్రం 6 గంటల లోపల క్యూ లైన్లో ఉన్న వారికి స్లిప్‌లు ఇచ్చి ఓటింగ్‌కు అవకాశం ఇస్తామని చెప్పారు. సెల్ ఫోన్‌లు పోలింగ్ బూత్‌లోకి అనుమతించరని స్పష్టం చేశారు. పోలింగ్ పూర్తయిన తరువాత ఎన్నికల సిబ్బంది ఆయా రూట్లలోని బస్సులలో గచ్చిబౌలి స్టేడియానికి చేరుకుంటారని పేర్కొన్నారు. చివరి బస్సు రాత్రి 10 గంటల వరకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌లను స్రూట్నీ చేసి చేవెళ్లకు తరలిస్తామని వివరించారు.

అతి పెద్ద నియోజకవర్గం

తెలుగు రాష్ట్రాలలోనే అతి పెద్దగా శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం ఉంది. మినీ భారత్‌ను తలపించే ఈ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య అంతకంతకు పెరిగిపోతోంది. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల సంఖ్య కంటే ప్రస్తుతం 25,596 మంది ఎక్కువగా ఉంది. నేడు జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 7,58,102 ఉండగా పురుషులు 4,00,361, మహిళలు 3,57,600, ఇతరులు 141 మంది ఓటర్లు ఉన్నారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు అధికారులు, సిబ్బంది చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం వరకు పోలింగ్ బృందం తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అనంతరం పోలింగ్ నిర్వహించే పాఠశాలల్లోని తరగతి గదులను పరిశీలించి, విద్యుత్ సరఫరా, ఇతర ఏర్పాట్లను వారు పరిశీలించారు. అనంతరం పోలింగ్ సామాగ్రిని పోలింగ్ నిర్వహించేందుకు సిద్ధం చేయడంలో అందరూ నిమగ్నమయ్యారు. పోలింగ్ నిర్వహణ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసుకోవడంపై అధికార యంత్రాంగం పూర్తి స్థాయి దృష్టి పెట్టింది. దీంతోపాటు జీహెచ్ఎంసీ అధికారులు వారికి సౌకర్యాలు కల్పిస్తూ పోలింగ్ సాఫీగా సాగేలా చూడడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

డీఆర్‌సీని సందర్శించిన కలెక్టర్..

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని ఈవీఎంలు పంపిణీ చేస్తున్న డీఆర్‌సీ కేంద్రాన్ని ఆర్‌ఓ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ పరిశీలించారు. ఎన్నికల పోలింగ్ సిబ్బంది, పోలింగ్ స్టేషన్లలో ఏర్పాట్లపై ఏఆర్‌ఓ, శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరిష్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ ఏర్పాట్లలో ఎలాంటి ఇబ్బందులు జరకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



పార్టీలో చేరిన వారికి ప్రత్యేక గుర్తింపు

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని సోలక్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నేత శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు యువకులు, నాయకులు కాటా శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు షురూ

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (రాజేంద్రనగర్)లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ బయాలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దోస్త్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని రాజేంద్రనగర్ కళాశాలకు మొదటి ఆప్షన్ ఇవ్వాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9441956233,7032713785 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యం

అత్తాపూర్: భార్యతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లి అదృశ్యమైన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ మహమ్మద్ హర్షద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మద్ మస్తాన్ మియా (42) తన కుటుంబ సభ్యులతో కలిసి ఎంఎం పహడీలో నివాసముంటున్నాడు. రోజువారీ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బట్టలు సరిగా ఇస్త్రీ చేయలేదని భార్యతో కూడా గొడవపడిన మస్తాన్ మియా ఈ నెల 8వ తేదీన తెల్లవారు జామున వెళ్లిపోయాడు. దీంతో బంధువులు, స్నేహితులు వద్ద గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో భార్య జుబేదాబేగం అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మస్తాన్ మియా పెద్ద కుమార్తెకు పెళ్లి చేయాలని సిద్ధమవుతున్న క్రమంలో ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మరో కౌన్సిలర్


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీకి చెందిన మరో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ పత్తి ప్రవీణ్‌కుమార్ ఆదివారం కాంగ్రెస్ గూటికి చేరారు. కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరగా ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, నార్సింగి మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందనే నమ్మకంతోనే కాంగ్రెస్‌లో చేరానని తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ అనిల్‌యాదవ్, రాష్ట్ర మైనార్టీ ఎడ్యుకేషన్ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ ఫహియొద్దీన్ ఖురేషి, మున్సిపాలిటీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ జి.విజయబాబు, నాయకులు మైలారం శ్రీనివాస్, డి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని రాష్ట్ర శాసన మండలి మాజీ ప్రోటెం చైర్మన్ వెన్నవరం భూపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం రామచంద్రాపురం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చెంది దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం బీఆర్‌ఎస్‌కు కంచుకోట అన్నారు.

ఉషా గాయత్రికి ఆత్మీయ సత్కారం

నాంపల్లి: సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు ఆధ్వర్యంలో యువ కళావాహిని నిర్వహణలో ప్రముఖ కూచిపూడి నృత్య గురువు డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రికి కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ఆత్మీయ సత్కార సభ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నిర్వహించారు. సారిపల్లి కొండలరావు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణ హాజయ్యారు. దూరదర్శన్ పూర్వ డైరెక్టర్ హైదరాబాద్ డాక్టర్ పాలకుర్తి మధుసూదనరావు హాజరై సభను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం, సినీ రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, కూచిపూడి నాట్య గురువు డాక్టర్ ఎస్.పి.భారతి, యువకళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ, కిన్నెర రఘురామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రి దంపతులను సత్కరించారు. సభా ప్రారంభంలో డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రి శిష్య బృందంచే ప్రదర్శించిన భజ గోవిందం సాంస్కృతిక కార్యక్రమం ఆకట్టుకుంది.



నృత్యం.. మంత్రముగ్ధం

మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకున్నాయి. చెన్నై నుంచి వచ్చిన భరతనాట్య కళాకారిణి రక్షా దేవనాదన్ నట్టైకురంజి రాగం వర్ణం, జయదేవ అష్టపది అంశాలను ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. కళాకారులు దీక్ష, అద్వితీ, శ్లోక, నయోనికా, లాస్య, లక్ష, సమన్విత, హెత్విక, తమదైన శైలిలో నృత్యాలు ప్రదర్శించారు.
–మాదాపూర్

ఘనంగా మాతృ దినోత్సవం


మహిళలను సన్మానిస్తున్న సభ్యులు

హాఫీజ్‌పేట్ : మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వేడుకలు ఆదివారం చందానగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృమూర్తులకు శాలువాతో సన్మానించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ వ్యవస్థాపక అధ్యక్షులు కొండ విజయ్ మాట్లాడుతూ.. క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మాతృదినోత్సవ వేడుకలకు నిర్వహిస్తున్నామన్నారు. సమాజంలో అమ్మది ఒక ప్రత్యేక స్థానమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మారం వెంకటేశ్వర్లు గుప్తా, మదుసుధన్‌రెడ్డి, విజయ్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం


ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి వద్ద అన్నదానం

గోల్కొండ: నిరంతరాయంగా అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని ప్రభుత్వ బాలుర సెకండ్ లాన్సర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ అన్నారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రులైన ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి, సరోజీదేవి కంటి ఆసుపత్రి, గోల్కొండ ఏరియా ఆసుపత్రులకు దూర ప్రాంతాల నుంచి నిరుపేదలు వైద్యం కోసం వస్తారన్నారు. వీరిలో చాలా మంది ఇన్‌పేషంటర్లుగా ఉండి చికిత్స పొందుతారని వారి వెంట వచ్చే సహాయకులకు ఉచితంగా భోజనం అందించేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు.

గుంతలోపడి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: ఎండ్రకాయలు పట్టేందుకు వెళ్లి గుంతలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ నరేష్ ముదిరాజ్ కథనం ప్రకారం పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ గ్రామం వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన దప్పు నర్సింలు(35) కూలి పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో 10వ తేదీన తన స్నేహితులు నాగులు, బాలకృష్ణతో కలిసి పనికి వెళ్లాడు. మల్లన్న గుట్ట సమీపంలోని గుంతల్లో ఎండ్రకాయలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు గుంతలో పడి మునిగిపోయాడు. దీంతో వెంటఉన్న స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి గుంతలో గాలింపు చేపట్టగా ఆచూకీ లభించలేదు. 11వ తేదీన మృతదేహం తేలడంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు జగన్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.